క్లుప్తంగా

ఉత్సాహంగా రాఖీ వేడుక



మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి రాఖీ కడుతున్న జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం

దెందులూరు: రాఖీ పండుగను గ్రామగ్రామాన విద్యా సంస్థల్లో వైభవంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం గంగరాజు, పెదవేగి ఎంపీపీ తాతా రమ్యశ్రీ, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు బోర్డు మాజీ డైరెక్టర్ తొత్తడి వేదకుమారితో పాటు పలువురు మహిళలు, ప్రజాప్రతినిధులు ఆప్యాయంగా మాజీ ఎమ్మెల్యేకి రాఖీలు కట్టారు. వారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వే ట్రాక్ మరమ్మతులు



దెందులూరు- శ్రీరామవరం మధ్య రైల్వేట్రాక్ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

దెందులూరు: దెందులూరు- శ్రీరామవరం మధ్య రైల్వే ట్రాక్ మరమ్మతులను రైల్వే అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది ముమ్మరంగా చేస్తున్నారు. ఈ నెల 15 నుంచి ట్రాక్ మీదుగా వాహనాల రాకపోకలను నిలిపివేయగా మరమ్మతులు పూర్తయిన వెంటనే ఈ నెల 23న పునఃప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. దెందులూరు నుంచి ద్వారకాతిరుమల వెళ్లే బస్సులను ట్రాక్ మరమ్మతు కారణంగా పక్క గ్రామాల మీదుగా నడుపుతున్నారు. భక్తులు, ప్రయాణికులు, విద్యార్థులు ప్రయాణ అవసరాల దృష్ట్యా మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసి గేటును తెరుస్తామని అధికారులు చెప్పారు.

బీఎల్వోలు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



బీఎల్వోల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బి.సుమతి

దెందులూరు: అన్ని గ్రామాల్లో బూత్ లెవెల్ ఆఫీసర్లు, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో గ్రామాల వారీగా ప్రభుత్వ నిబంధనలపై అవగాహన, సమీక్ష సమావేశం నిర్వహించారు. బూత్‌లవారీగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణపై అవగాహన కల్పించారు. సమీక్ష సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని ఉన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం



భీమడోలు శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతి

భీమడోలు: గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని ఎంపీడీవో సీహెచ్ పద్మావతి అన్నారు. భీమడోలు మండల పరిషత్ సమావేశంలో సర్పంచుల విధులు, బాధ్యతలపై చేపట్టిన మూడు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈవోఆర్‌డీ ఏ.సుందరి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎంపీడీవో సీహెచ్ పద్మావతి పాల్గొని గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి సర్పంచులు, గ్రామ కార్యదర్శులు ప్రణాళికలను తయారు చేసుకుని వాటిని అమలు చేసుకునేందుకు ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పాము సునీత, గుడివాడ నాగగౌతమి, ఏపూరి భానుదీపిక, షేక్ రహీమాబేగం, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఏలూరు టౌన్: అప్పు చెల్లించాలని అడిగితే కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఏలూరు నగర శివారు చొదిమెళ్ల సుంకరవారితోటకు చెందిన అరుగుల ఉషారాణి వద్ద పెదవేగి మండలం వంగూరుకు చెందిన గొట్టాపు శ్రీనివాస్ దఫదఫాలుగా కొంత సొమ్ము అప్పు తీసుకున్నారు. డబ్బులు బాకీ చెల్లించకపోవటంతో ఉషారాణి గట్టిగా అడిగింది. దీంతో శ్రీనివాస్, అతని భార్య శిరీషా, శ్రీనివాస్ తండ్రి సుబ్బారావు ఉషారాణిని కులం పేరుతో దూషించారు. ఈ క్రమంలో బాధితురాలు వీరిపై ఏలూరు రూరల్ పోలీసు స్టేషన్ ఫిర్యాదు చేయటంతో సీఐ రాజశేఖర్ ఆదేశాల మేరకు ఎస్సై రాజారెడ్డి సోమవారం ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మసకబారుతున్న నేత్రాలు

- అధికమైన కంటి సమస్యలు
- సెల్‌ఫోన్, కంప్యూటర్ అధికంగా చూడటమే కారణం



దెందులూరు సీహెచ్‌సీలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

దెందులూరు: మారుతున్న కాలానుగుణంగా.. జీవనశైలిలో మార్పు కారణంగా కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. సామాన్యుడి నుంచి సంపన్నుడి వరకు ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉండాల్సిందే. ఏ కాస్త సమయం దొరికితే చాలు.. చాలామంది మొబైల్, కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లతో ఎక్కువ సమయం గడుపుతున్నారు. దీంతో కళ్ల సమస్యలు అధికమై నిద్ర లేమి వేధిస్తోంది. ఎలక్ట్రానిక్ తెరల కాంతి కారణంగా కళ్లు పొడిబారిపోతున్నాయి. కళ్ల సమస్యలతో ఆస్పత్రుల చుట్టూ తిరిగే వారి సంఖ్య అధికమైంది. దెందులూరు సీహెచ్‌సీలో కంటి సమస్యలతో నిత్యం 40 నుంచి 50 మంది వస్తున్నారు. అందులో 8 నుంచి 10 శాతం మంది కళ్లు పొడిబారిన కేసులే నమోదు కావడం విశేషం. పెదపాడు, పెదవేగి పీహెచ్‌సీల్లో ఈ సమస్యలను వైద్యులు అధికంగా గుర్తిస్తున్నారు. చూడడానికి ఇది చిన్నదే అనిపించినా నిర్లక్ష్యం చేస్తే కళ్లకే ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు.

లక్షణాలు ఎలా ఉంటాయంటే

కళ్లు పొడిబారి పోవడం వల్ల నలక పడినట్టు అనిపిస్తుంది. కళ్లు గుచ్చుకుంటుండడంతో తరచూ కళ్లు నలుపుతుంటారు. మరికొందరికి కళ్ల నుంచి విపరీతంగా నీరు కారుతోంది. చేతులతో కళ్లు తుడుస్తుంటారు. ఇలా చేయడం వల్ల సమస్య మరింత జటిలం అవుతుంది. ఒక్కోసారి కంటిలోని నరాలు దెబ్బతింటాయి. ఈ కారణంగా కళ్లు నలపడం, రుద్దడం లాంటివి చేయకూడదు. ఇంకొందరు కంటిలో మట్టిపడిందని నాటు వైద్యులను ఆశ్రయిస్తారు. నాలుకతో మట్టి తీయించడం చేస్తారు. ఇది చాలా ప్రమాదం.

కళ్లు పొడిబారితే ఏం చేయాలంటే

- చల్లటి నీటిని కళ్లమీద చల్లుకోవాలి. దీని వల్ల కంటి రెప్పలో రక్త ప్రసరణ పెరుగుతుంది.
- కనుగుడ్డు అటూఇటూ గుండ్రంగా తిప్పాలి.
- చల్లటి శుభ్రమైన గుడ్డను కళ్లపై ఉంచుకోవాలి.
- కంప్యూటర్ లేదా మొబైల్ ఫోన్ నుంచి ప్రతి 20 నిమిషాలకోసారి బ్రేక్ తీసుకోవాలి. కంప్యూటర్ లేదా టీవీలను 20 అడుగుల దూరం నుంచి చూసే అలవాటు చేసుకోవాలి. దీన్ని ట్వంటీ సిస్టం అంటారు. దీని వల్ల కంటిపై ఒత్తిడి తగ్గుతుంది. ఉపశమనం దొరుకుతుంది.
- సమస్య ఎక్కువగా వేధిస్తుంటే నేత్ర వైద్య నిపుణుల సలహా ప్రకారం లూబ్రికెంట్ డ్రాప్స్ వాడాలి.
- సుగర్ వ్యాధిగ్రస్తులైతే ఆహార నియమాలను పాటిస్తూ క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలి.
- వైద్యుల సలహా మేరకు యాంటీ రిఫ్లక్టెడ్ కోటింగ్ కలిగిన కళ్లజోళ్లు వాడాలి.

కళ్లపై శ్రద్ధ వహించాలి



కళ్లపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి. చర్మం, నోరు పొడిబారినట్లే కళ్లు కూడా పొడిబారుతాయి. గతంలో ఈ సమస్య చాలా అరుదుగా కనిపించేది. ప్రస్తుతం ప్రతి పది మందిలో ఆరుగురికి ఈ సమస్య ఉన్నట్లు గుర్తించాం. కారణం సెల్‌ఫోన్, కంప్యూటర్, ఇతర గాడ్జెట్లు వాడడం అధికమైంది. రేడియోషన్‌తోనూ ఈ సమస్యగా ఎక్కువగా కనిపిస్తోంది. కంటి ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం. నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ప్రతి ఆరు నెలలకొకసారి తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలి. వీలైన మేరకు మొబైల్, కంప్యూటర్ వినియోగదానికి దూరంగా ఉండాలి.

– డాక్టర్ సుందర్‌కుమార్, దెందులూరు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్

రేపు భారత్ బంద్

భీమడోలు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను నిరసిస్తూ ఈనెల 21న తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాల పోరాట యోధుల సంఘం జేఏసీ నాయకులు కోరారు. భీమడోలులో సోమవారం వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర నాయకులు, ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్ మాట్లాడుతూ భారత్ బంద్‌లో భాగంగా భీమడోలు మండలంలోని నిర్వహిస్తున్న బంద్‌లో మాల సోదరులంతా అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసనను తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాము మాన్‌సింగ్, అంబటి నాగేంద్ర ప్రసాద్, పైడిమాల యుగంధర్, గోగులమూడి రవికుమార్, ఎంపీటీసీ ఇంజేటి జూనియర్ కోరారు.

ఎమ్మార్పీఎస్ నేతకు పలువురి పరామర్శ

దెందులూరు: ఎమ్మార్పీఎస్ దెందులూరు నియోజకవర్గ అధ్యక్షుడు కె.మురళీకృష్ణకు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. వైద్యశాలలో చికిత్స పొందుతున్న మురళీకృష్ణను పొలిమేర హరికృష్ణ, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్, రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, మండల నాయకులు చల్లపల్లి ప్రసాద్ తదితరులు సోమవారం పరామర్శించారు. సంఘటనా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

నిడమర్రు: నేటి నుంచి ఓటరు జాబితా సవరణ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిడమర్రు తహసీల్దారు ఎస్. నాగరాజు తెలిపారు. సోమవారం స్థానిక తాహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన బీఎల్వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20 నుంచి వచ్చే అక్టోబరు 18 వరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని, ఇంటింటా సర్వేతో బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి పరిశీలించి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, తప్పులు సవరణ వంటి పనులు చేపట్టాలన్నారు. వచ్చే అక్టోబరు 29న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయాలన్నారు. వీటిపై సవరణలు, అభ్యంతరాలకు నవంబరు 28 వరకు స్వీకరిస్తారని, డిసెంబరు 24లోపు పరిష్కరించాలన్నారు. వచ్చే జనవరి 6వ తేదీ తుది ఓటరు జాబితా ప్రచురించేలా బీఎవ్వోలు కృషి చెయ్యాలన్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో ఇంటింటి సర్వే చాలా ముఖ్యమని సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో బూత్ లెవెల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి సూచనలు, అభిప్రాయాలను తీసుకోవాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో డీటీ శేఖర్‌బాబు మండలంలోని 38 మంది బీఎల్వోలు పాల్గొన్నారు.



బీఎల్వోల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.నాగరాజు

ఓటర్ల జాబితా సవరణ

దెందులూరు : ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, మార్పుల కోసం ఫారం- 6, 7 దరఖాస్తులు ఇవ్వడానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు దెందులూరు తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 20 నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు ఇంటింటా సర్వే జరిపి ఓటర్ల జాబితాను నూతనంగా తయారు చేస్తారన్నారు. దెందులూరు నియోజకవర్గంలో ఓటర్లందరూ వారి ఓటును పరిశీలించుకుని ఏమైనా సవరణ ఉంటే దరఖాస్తు చేయాలన్నారు. అక్టోబర్ 10 2020 నాటికి అర్హులైన ఓటర్లు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్, తహసీల్దార్ సుమతి తెలిపారు.

పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత

టాయిలెట్ల ఫొటోల బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎస్ఎంసీ కమిటీకి అప్పగింత

నిడమర్రు: ప్రభుత్వ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యతను సచివాలయంలోని సంక్షేమ సహాయకులకు, ఇటీవలే ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీకి అప్పగిస్తూ ఏపీ మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ బి. శ్రీనివాసరావు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలల్లో, కళాశాలల్లో మరుగుదొడ్లు, మూత్ర విసర్జన, వాష్‌బేసిన్ తదితర శుభ్రత నిర్వహణకోసం టాయిలెట్ మేయింటినెన్స్ ఫండ్ (ఎస్టీఎఫ్) పేరుతో పాఠశాల స్థాయిలో నిధిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చే బాధ్యతను ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఫొటోలు తీసే బాధ్యత నుంచి ప్రధానోపాధ్యాయలను తప్పించి కేవలం సర్వే ఫారం నింపేలా బాధ్యతను అప్పగించారు. ప్రతి రోజు సాయంత్రం వేళల్లో ఆయా సర్వే ఫారం ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ప్రతి సోమవారం, గురువారం వెల్ఫేర్ అసిస్టెంట్ కేటాయించిన పాఠశాలలకు, జూనియర్ కళాశాలను స్వయంగా సందర్శించి ఐఎంఎంఎస్ / సీఆర్ యాప్‌లో ఫోటోలు అప్‌లోడ్ చేయాలి. పరిశుభ్రత విషయంలో ఏమైనా లోపాలుంటే రిమార్క్ కాలంలో నమోదు చేయాలి. ప్రతి బుధవారం, శుక్రవారం రోజున పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ లేదా సభ్యులు పాఠశాలను సందర్శించి ఐఎంఎంఎస్ యాప్‌లో ఫోటోలు తీసి నమోదు చేయాల్సి ఉందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. టాయిలెట్ కెమికల్స్ అందుబాటులో ఉన్నాయా లేదా ఆయా కేటాయించిన రోజువారీ పరిశుభ్రత పని నిర్వహిస్తుందా లేదా అనే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాల్సి ఉంది.

కోసూరి జయసుధకు వచన కవితా పురస్కారం

భీమడోలు: పూళ్ల గ్రామానికి చెందిన కోసూరి జయసుధకు రాష్ట్రస్థాయిలో వచన కవితా ప్రతిభ పురస్కారాన్ని అందుకుంది. గుంటూరులో ఆదివారం నిర్వహించిన గుంటూరు, అమరావతి సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో ఆమెకు ఉత్తమ ప్రతిభ పురస్కారాన్ని అందించి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. ఫేస్‌బుక్ అమరావతి సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో గ్రూపులో మూడు నెలల పాటు 13 వారాలు పాటు నిర్వహించిన వచన కవితల పోటీల్లో జయసుధ అత్యుత్తమ ప్రతిభను చాటింది. ఆమెకు రాష్ట్రస్థాయి సాహితీ ప్రముఖులు దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించారు. రాష్ట్రస్థాయిలో పురస్కారం ఆమెను గ్రామస్తులు, పెద్దలు సోమవారం అభినందించారు.



గుంటూరులో వచన కవితా ప్రతిభ పురస్కారాన్ని అందుకుంటున్న కోసూరి జయసుధ

వైఎస్సార్‌సీపీ నాయకుడిని పరామర్శించిన జెడ్పీ చైర్‌పర్సన్



కొత్తూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడిని పరామర్శించిన జెడ్పీచైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు

పెదపాడు : వైఎస్సార్‌సీపీ నాయకుడు కడిమి గోవిందరావును జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు సోమవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై విజయవాడలో చికిత్స పొంది అనంతరం ఇంటికి చేరుకున్న గోవిందరావును ఆయన నివాసంలో జెడ్పీచైర్‌పర్సన్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి

భీమడోలు: ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని భీమడోలు ఎంఈవో-1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు సోమవారం ముగిశాయి. పలు అంశాలపై శిక్షణ అందించారు. రిసోర్స్‌పర్సన్లు పాశం పాండురంగారావు, ఉపేంద్ర, మండే సుధాకర్, ఝాన్సీరాణి, శేఖర్ వ్యవహరించారు. హైస్కూలు ఇన్‌చార్జి ఆహ్మద్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. పాఠశాలల్లో విద్యాప్రమాణాలను మెరుగుపర్చేందుకు ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

పెదపాడు: జంతువులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా మానవరం నుంచి తమిళనాడులోని పాలాచికి 30 ఎద్దులను లారీలో అక్రమంగా తలిస్తున్నట్టు గుర్తించామన్నారు. కలపర్రు టోల్‌గేట్ వద్ద లారీని అడ్డుకుని ఎద్దులను గోసంరక్షణ శాలకు తరలించినట్లు పెదపాడు ఎస్సై తెలిపారు. జంతువులను రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదపాడు ఎస్సై శుభశేఖర్ తెలిపారు.

డాగూరే సేవలు చిరస్మరణీయం

భీమడోలు: ఫొటోగ్రఫీ సృష్టికర్త డాగూరే సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు సర్కిల్ ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం డాగూరే జయంతిని పురస్కరించుకుని ఫొటోగ్రఫీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. భీమడోలు సంతమార్కెట్ వద్ద గల డాగూరే, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు ద్రాక్షారపు విశ్వనాథం, గౌరవాధ్యక్షుడు పిల్లి బ్రహ్మారావు, డి.డేవిడ్, పుల్లా బోట్ల శ్రీరామ్మూర్తి, అలజింగి రంగారావు తదితరులు పాల్గొన్నారు.



భీమడోలులో డాగూరే, కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

డంపింగ్ యార్డుకు స్థల పరిశీలన



దెందులూరులో డంపింగ్ యార్డుకు స్థల పరిశీలిస్తున్న తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ శ్రీలత

దెందులూరు: 11 ఏళ్లుగా దెందులూరు గ్రామానికి తీరని సమస్యగా ఉన్న డంపింగ్ యార్డు నిర్మాణం కోసం సోమవారం మండల అధికారులు దెందులూరులో స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ బీ.సుమతి, ఎంపీడీఓ వీ.శ్రీలత, క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్య చౌదరి, నాయకులు ఇప్పిలి వెంకటేశ్వరరావు, మహేష్ గ్రామంలో మూడు ప్రాంతాలను పరిశీలించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశాల మేరకు స్థల సేకరణ పరిశీలను చేసి త్వరితగతిన పూర్తిచేసి పరిష్కారం చేస్తామని తహసీల్దార్, ఎంపీడీఓ అన్నారు.

ఉత్సాహంగా రక్షాబంధన్ వేడుక

ఉంగుటూరు: గ్రామాల్లో రక్షాబంధన్ వేడుకను ఉత్సాహపూరిత వాతావరణంలో సోమవారం జరుపుకున్నారు. తోబుట్టువులు తమ సోదరులకు రాఖీ కట్టారు. ఉదయం నుంచి రాఖీలు విక్రయించే దుకాణాలు, స్వీట్‌స్టాల్స్ వద్ద రద్దీ నెలకొంది. పాఠశాలల్లో ప్రత్యేకంగా రాఖీ కట్టించే కార్యక్రమం నిర్వహించారు.

పలు ప్రాంతాల్లో ఫాగింగ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా నగరంలో సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో దోమల నివారణ కార్యక్రమం చేపట్టినట్టు నగరపాలక సంస్థ వైద్య అధికారి మాలతి తెలిపారు. ఈ మేరకు స్థానిక 4వ డివిజన్‌లోని శ్రీరామనగర్ స్కూల్ రోడ్డు, మారుతి నగర్, నాగేంద్ర కాలనీ తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూనలకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేసినట్టు చెప్పారు.

23న ఉపాధి హామీపై గ్రామసభలు

దెందులూరు: దెందులూరు మండలంలో ఈనెల 23న 17 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంపై గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ వీ.శ్రీలత, ఉపాధి ఏపీఓ దశరథరామ్‌జీ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రతి గ్రామ సభ నిర్వహణకు 9 మంది మండలాధికారులను నియమించామన్నారు. ఈఓపీఆర్‌డీ, ఆర్‌డబ్ల్యూఎస్‌ఏఈ, డీఆర్‌ఏఈ, హౌసింగ్ ఏఈ, అగ్రికల్చర్ ఆఫీసర్, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, ఉపాధి ఏపీఓ, ఎంఈఓ, ఈసీలను అధికారులుగా నియమించామన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రాధాన్యత క్రమంలో మెటీరియల్ రిలేటెడ్, ఉపాధి గ్రామ సభలు నిర్వహిస్తామని ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామస్థాయి ఉద్యోగులతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు సభలు నిర్వహిస్తామని వివరించారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డుల అందజేత

ఉంగుటూరు: నారాయణపురం కళాశాలలో 140 మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరారని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులందరికీ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ గుర్తింపు కార్డుల తయారీకి గ్రామానికి చెందిన పాతూరి సత్యనారాయణ రూ.5 వేలు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఆర్ రంగనాథన్ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

శిక్షణాంశాలను బోధనలో అనుసరించాలి

ఉంగుటూరు: కాంప్లెక్సులో నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో పాఠ్యాంశాల బోధనలో అనుసరించాలని ఉంగుటూరు ఎంఈవో 2 భాస్కరరావు అన్నారు. సోమవారం బాదంపూడి, ఉంగుటూరు, నారాయణపురం, గొల్లగూడెంలో ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో భాస్కరరావు మాట్లాడారు. కాంప్లెక్సు చైర్మన్ గుళ్లప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కోడి వ్యర్థాలు కలిపితే కేసు

ఉంగుటూరు: చేపల చెరువుల్లో కోడి వ్యర్థాలు కలిపితే బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని తహసీల్దారు శేఖర్ సోమవారం తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో వీఆర్వో, పోలీస్, ఫిషరీస్ సహాయకుడితో కలిసి ఓ బృందంగా ఏర్పడి దీనిపై పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు.

దూరవిద్యతో బంగారు భవిష్యత్తు నిర్మాణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులతో బంగారు భవిష్యత్ నిర్మించుకోవచ్చని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి విడుదల చేశారు. ఈ ప్రత్యేక దూర విద్యావిధానంలో నిర్వహిస్తున్న కోర్సులకు ఇంటర్ నెట్, ఏపీ ఆన్‌లైన్, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రవేశం పొందే అవకాశం ఉందని చెప్పారు. ఓపెన్ స్కూల్లోని పదోతరగతి, ఇంటర్మీడియేట్ కోర్సుల్లో నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వివరాలకు డీఈఓ, డీవీఈఓ, ఆర్ఐఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ, లేదా సమీపంలోని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఉన్నతపాఠశాల హెడ్మాష్టార్‌లను లేదా హెల్ప్ లైన్ 0863 2239151లో సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్‌ఓ డి.పుష్పమణి, డీఈఓ ఎస్ అబ్రహాం, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం. ముక్కంటి, కె.భాస్కర్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలు వేదాలు

గణపవరం: వేదాలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని, వేదాలను అనుసరించడం ద్వారా ప్రతి ఒక్కరూ ఉత్తమ సంస్కార వంతులుగా ఎదుగుతామని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గణపవరం మండలం సరిపల్లెలోని సఖ్యాభివర్ధక నిలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 104వ వేద పరిషత్ మహా సభల్లో నిర్వహించిన వేద పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదాలను భావితరాలకు అందించే బాధ్యత పండితులు, ఘనపాఠీలదేనని అన్నారు. ఈ సందర్భంగా నాలుగు వేదాలైన రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాల్లో ఉత్తీర్ణులైన వేద విద్యార్థులకు ధ్రువ పత్రాలను ఆయన అందజేశారు. ఈవేద పరీక్షలకు పది రాష్ట్రాలకు చెందిన 105 మంది హాజరయ్యారు. సుమారు 12మంది వేద పండితులు, ఘనపాఠీలు వేద విద్యార్థులకు ఆయా విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. దాదాపు 90 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా వారిని ఎమ్మెల్యే ధర్మరాజు అభినందించారు. ఈ సందర్భంగా ఘనపాఠీలు, వేద పండితులకు గణపవరానికి చెందిన ఆధ్యాత్మికవేత్త సాగిరాజు సుబ్బరాజు కుటుంబ సభ్యులు పండిత సత్కారం నిర్వహించి, వేద ఆశీర్వచనాలు పొందారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సరిపల్లె గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు కె.సుబ్బరాజు, కె.సత్యనారాయణమూర్తి, క్రొవిడి సాయి, కె.విశారదను పలువురు అభినందించారు.



వేద పరీక్షలలో ఉత్తీర్ణులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

సమస్యలపై అర్జీల స్వీకరణ



గాలాయగూడెంలో మీ కోసం కార్యక్రమంలో మాట్లాడుతున్న చింతమనేని ప్రభాకర్

దెందులూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రాధాన్యతక్రమంలో అమలు చేస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. సోమవారం గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయ ఆవరణలో మీ కోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. తహశీల్దార్ బీ.సుమతి, ఎంపీడీఓ వీ.శ్రీలత, మండల పార్టీ అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), మాజీ ఎంపీపీ కొడాలి ఆంజనేయచౌదరి, మండల నాయకులు పాల్గొన్నారు. అనంతరం అచ్చమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు.